క్లుప్తంగా

అంజనాసుతుడికి నింబ ఫలార్చన



తెనాలి: పట్టణ మారీసుపేటలోని శ్రీ బాలత్రిపురసుందరీ సమేత శ్రీచంద్రశేఖరస్వామి దేవస్థానంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆంజనేయ స్వామివారికి నింబ ఫలార్చన చేశారు. దేవస్థానంలో ఈనెల 26వ తేదీ నుంచి ఒకటో తేదీ వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు, పది లక్షల ప్రదక్షిణముల మహాయజ్ఞం జరుగున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జరిగిన విశేష పూజల అనంతరం లలితా గోష్ఠిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంథి సేతుమాధవ రావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్య శశిధర రావు, కోశాధికారి వరదా వెంకట శేషగిరిరావు, పేరుబోయిన అంకమ్మరాజు, తాడిపర్తి హరిప్రసాద్ పర్యవేక్షించారు.

2న అన్నమయ్య సంకీర్తనార్చన

తెనాలి: శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల 616 జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా జూన్ 2వ తేదీన అన్నమయ్య సంకీర్తనార్చన ఏర్పాటు చేసినట్టు సంకీర్తనా గురువు కొండపి వసుంధర తెలియజేశారు. ఆరోజు సాయంత్రం 6.30 గంటల్నుంచి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం కళావేదికలో శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో సంకీర్తనార్చన జరుగుతుందని తెలిపారు. సత్యనారాయణ భజన మండలి, శ్రీవత్స భజన మండలి, శ్రీపద్మావతి భజన మండలి గాయకులు పాల్గొంటారని వివరించారు.

అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు



తెనాలిరూరల్: కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అలజడులు రేకెత్తించినా కఠినంగా వ్యవహరిస్తామని టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్ ప్రజలను హెచ్చరించారు. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా టూ టౌన్ పోలీసులు శుక్రవారం స్థానిక బీసీ కాలనీలో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల వివరాలను తెలుసుకోవడంతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 10 బైక్‌లను సీజ్ చేశారు.

బాలసాహిత్య సమ్మేళనంలో హకీంజాని



తెనాలి: తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 29, 30 తేదీల్లో జరిగిన బాలసాహిత్య సమ్మేళనంలో పట్టణానికి చెందిన బాలసాహిత్యవేత్త షేక్ అబ్దుల్ హకీం జాని పాల్గొన్నారు. తొలి సంకలనంలో హకీం జాని రచించిన బాలల కథ 'నలుగు గుండిగలు' ప్రచురించారు. హకీంజాని బాల సాహిత్య సేవలను ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ డైరెక్టర్ ఎం.రాధారెడ్డి ప్రశంసించారు. సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బాలల కథాసంకలను ఈ వేదికపై ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వ మోడల్ స్కూల్స్ సంయుక్త సంచాలకుడు పాలడుగు సరోజినీదేవి, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ధూమపాన రహిత సమాజం కోసం కృషి



నిజాంపట్నం: ధూమపాన రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూచినపూడి పీహెచ్‌సీ వైద్యుడు నాగార్జున పేర్కొన్నారు. ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యశాల ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ధూమ పానానికి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని కోరారు. వదిలిన పొగను పీల్చిన అనారోగ్యం పాలవ్వక తప్పదన్నారు. దీంతో కాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె జబ్బులకు దారితీస్తుందని చెప్పారు. అలాగే ఖైనీ, గుట్కా, విమల్ వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఠాణాలో ప్రైవేటుచోదకుల హవా

- లైసెన్సు హోంగార్డులు, కానిస్టేబుళ్లను వద్దంటున్న పోలీస్ బాస్‌లు
- ప్రైవేటు డ్రైవర్లతో దందాలు?



తెనాలిరూరల్: తెనాలి పోలీసు శాఖలో ప్రైవేటు డ్రైవర్లదే హవా నడుస్తోంది. అధికారుల సొంత పనులతో పాటు వారికి సంబంధించిన దందాలు వీరి చేతుల మీదుగానే జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. డ్రైవింగ్ లైసెన్సు కలిగిన హోంగార్డులు, కానిస్టేబుళ్లు ఉన్నా వారిని కాదని మరీ ప్రైవేటు వ్యక్తులను డ్రైవర్లుగా అధికారులు పెట్టుకుంటున్నారు. తెనాలి పట్టణం, మండలంకు సంబంధించి నాలుగు పోలీస్‌స్టేషన్లు ఉండగా నలుగురు ప్రైవేటు వ్యక్తులు డ్రైవర్లుగా పని చేస్తున్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఉన్న ఇద్దరు హోంగార్డులు, సుమారు 10 మందికిపైగా కానిస్టేబుళ్లు ఉన్నారు. అయినా వీరెవరినీ డ్రైవర్లుగా వినియోగించుకునేందుకు అటు ఎస్‌ఐలు, ఇటు సీఐలు ఆసక్తి చూపడంలేదు. తమకు కావల్సిన బయటి వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకుని అసలు సిబ్బందిని నిర్లక్ష్యం చేస్తున్నారు.

దందాల కోసం ప్రైవేటు వ్యక్తులా.?

పోలీసు అధికారులు చేసే అక్రమాలు, దందాల కోసమే ప్రైవేటు వ్యక్తులను సొంత డ్రైవర్ల కింద పెట్టుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎన్నికల బదిలీల్లో వచ్చిన అధికారులు సైతం ప్రైవేటు వ్యక్తులనే డ్రైవర్లుగా పెట్టుకున్నారు. తెనాలిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో డ్రైవరుగా పని చేస్తున్న యువకుడిపై అనేక ఫిర్యాదులు రావడంతో కొద్ది రోజుల క్రితం విధులకు రావద్దని స్టేషను సిబ్బంది చెప్పి పంపారు. అదే స్టేషనుకు కొత్తగా వచ్చిన ఎస్‌ఐకు అనుకూలంగా ఉంటుండడంతో తిరిగి డ్రైవరుగా కొనసాగిస్తున్నట్టు తెలిసింది. తమకు అనుకూలంగా ఉండే ప్రైవేటు వ్యక్తులను డ్రైవరుగా పరిచయం చేసి వాళ్ల ద్వారానే వసూళ్లు, ఇతర దందాలకు పాల్పడుతున్నట్టు సమాచారం. ఇందు కోసమే బయటి వారికి అధికారిక వాహనాలు అప్పజెప్పి తిప్పుతున్నారని పోలీసుల శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు ప్రవేటు డ్రైవర్లు ప్రభుత్వ వాహనంలో దర్జాగా తిరుగుతూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలూ లేకపోలేదు. పోలీసుల శాఖలో ప్రైవేటు డ్రైవర్లను నియమించుకునేందుకు ఎటువంటి ప్రొవిజను/ అధికారిక బడ్జెట్ లేదు. అయినా వేలాది రూపాయలు వీరికి జీతాలుగా ఇస్తూ/ఇప్పిస్తూ బయటి వ్యక్తులను సొంత డ్రైవర్లుగా నియమించుకుంటున్నారు.

ఫిర్యాదులపై సమీక్షిస్తా

ప్రైవేటు డ్రైవర్లపై వస్తున్న విమర్శలు, ఫిర్యాదులపై త్వరలో సమీక్ష నిర్వహిస్తా. నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటా.

–ఎం.రమేష్, డీఎస్పీ

ఏకగ్రీవంగా అజెండా ఆమోదం



కుళాయిల పన్నుపై పరస్పరం విమర్శించుకుంటున్న సభ్యులు



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలిరూరల్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్లో జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండాలో ప్రతిపాదించిన అంశాలపై కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. కుళాయిలపై వేస్తున్న పన్ను విషయమై కౌన్సిల్ సభ్యుల మధ్య వాదనలు జరిగాయి. టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావ్ మాట్లాడుతూ తన వార్డులో వేసిన కుళాయిల్లో నీటి సరఫరా లేదని, అయినా కుళాయిలకు పన్ను వేయడం సమంజసం కాదంటూనే పురపాలక సంఘం దోపిడీ చేస్తుందన్నారు. దీనికి వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ నీటి సరఫరాలేని కుళాయిలకు పన్ను వేయడం టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిందని, దోపిడీ అనేది మీ టైంలోనే జరిగిందని విమర్శిస్తూ కౌంటర్ వేశారు. ఇంతలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కలుగజేసుకొని దోపిడీ అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో టీడీపీ కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి కలగజేసుకుని పన్ను వసూలు చేయడం తప్పు కదా అని అనటంతో సభ్యుల మధ్య వాదనలు జరిగాయి.

ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ గతంలోనూ ఇదే సమస్యపై చర్చ జరిగిందని, ఇందుకు సంబంధించి కమిటీ వేశానని, ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయిందని చెప్పారు. ఆరో తేదీ తర్వాత దీనిపై సమగ్రమైనటువంటి నివేదిక ఇస్తానని కమిషనర్ చెప్పడంతో సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



శోభాయాత్ర ఎదుట స్వామి వారి జయ పతాకాలతో మహిళా భక్తులు

తెనాలి: పట్టణ షరాఫ్‌బజారులోని శ్రీసువర్చలా సమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో జూన్ ఒకటి నుంచి 11వ తేదీ వరకు జరగనున్న 16వ వార్షిక లక్ష శ్రీహనుమాన్ చాలీసా పారాయణ, వార్షిక శ్రీ హనుమజ్జయంతి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం శోభాయాత్రను నిర్వహించారు. దేవస్థానం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర షరాఫ్ బజార్, బోస్‌రోడ్డు, మెయిన్ రోడ్డు, సత్యనారాయణ టాకీస్ రోడ్డు మీదుగా సాగింది. ఆంజనేయ స్వామి పతాకాన్ని చేపట్టి భక్తులు శ్రీరామ జయ రామ జయజయ రామ అంటూ శోభాయాత్రలో పాల్గొన్నారు. మహిళలు విశేష సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్వామి హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా శోభాయాత్ర నిర్వహించినట్టు తెలిపారు. జూన్ ఒకటో తేదీ నుంచి జరిగే వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ ఉంటాయన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు తీసుకోవాలని కోరారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్.బి.శివ, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవా సమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం.వెంకటేష్, కె.రాజశేఖర్, బి.లీలాప్రసాద్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.

గాయత్రీ సత్యదేవ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ సత్యదేవ మందిరంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ప్రారంభించారు. పదిహేను మంది రుత్వికులతో, వేద పండితుల వేద స్వస్తితో వైభవంగా మొదలయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను ఆలయ కమిటీ అధ్యక్షులు రాళ్లబండి వేంకట సత్యరామాంజనేయశర్మ పర్యవేక్షించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం సందర్భంగా విద్యార్థులకు శుక్రవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు డ్రాయింగ్, పేపర్ ఆర్ట్, కథలు, కథానికలు నేర్చుకుని సృజనాత్మక నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు.

సూపర్ స్టార్ కృష్ణ చిరస్మరణీయుడు



లక్ష్మీపురం: నిజ జీవితంలోనూ మనసున్న మనిషిగా సినీ రంగంలో తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్న జి.కృష్ణ ఎప్పటికీ తెలుగు వారి సూపర్ స్టార్‌గా నిలిచి పోతారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, గాయకుడు శ్యామల కోటిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సూపర్ స్టార్ కృష్ణ జయంతి ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి మాట్లాడుతూ సినీ పరిశ్రమలో మంచి మనిషిగా నిర్మాతగా హీరోగా, నటశేఖరుడిగా సూపర్‌స్టార్‌గా పిలిపించుకున్న కృష్ణ 340కి పైగా చిత్రాలలో నటించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు మేకల పురుషోత్మ ప్రసాద్, సుబ్బారావు, కోటిరెడ్డి, థామస్ పాల్గొని నివాళులర్పించారు.

నిబద్ధత కలిగిన పాత్రికేయుడు గోపాలకృష్ణ

సంతాప సభలో వక్తలు



మృతి చెందిన పాత్రికేయులకు నివాళి

తెనాలి: నిబద్ధత కలిగిన పాత్రికేయుడు ఆర్ఎస్ గోపాలకృష్ణ మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని ఏపీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. గతేడాది మృతిచెందిన జర్నలిస్టు కందుల శ్యామ్, ఈనెల 24న మరణించిన ప్రెస్ ఫొటోగ్రాఫర్ చుక్కా శ్రీనివాస బాబు మృతి బాధాకరమన్నారు. ఏపీయూడబ్ల్యుజే, తెనాలి కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మృతి చెందిన పాత్రికేయుల సంతాప సభను నిర్వహించారు. కమిటీ తెనాలి అధ్యక్షుడు చందు సుబ్బారావు అధ్యక్షత వహించారు. నాగుల్ మీరా తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు చిన్న వయసులోనే మరణిస్తుండటం ఇటీవల కాలంలో గమనిస్తున్నామని చెప్పారు. ఆరోగ్యబీమాతో ప్రభుత్వం ఆదుకోవాలని సూచించారు. విలేకరులు తగు జాగ్రత్తలతో విధులను నిర్వర్తించాలని కోరారు.

సీనియర్ పాత్రికేయుడు నిమ్మ రాజు చలపతిరావు మాట్లాడుతూ సాధారణమైన కుటుంబం నుంచి వచ్చిన ఆర్ఎస్ గోపాలకృష్ణ పాత్రికేయ వృత్తిలో నిబద్ధతతో పని చేశారని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ రిటైరయ్యాక అర్చకుడిగా జీవితాన్ని గడిపారని వివరించారు. ఐజేయూ సభ్యుడు, సీనియర్ విలేకరి బీఎల్ నారాయణ మాట్లాడుతూ ఆర్ఎస్ గోపాలకృష్ణ, చుక్కా శ్రీనివాస బాబు, కందుల శ్యామ్‌తో తనకు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఏపీయూడబ్ల్యుజే జిల్లా కార్యదర్శులు చొప్పర సుధాకర్, ఎల్.వెంకటేశ్వర రావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కారుమంచి సునీల్ సందీప్, బొల్లిముంత కృష్ణ, దేవయ్య, మురళి, ఎం.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు. ఐజేయూ సభ్యుడు మార్కండేయులు పర్యవేక్షించారు.

18 మంది ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు



సర్వేను పరిశీలిస్తున్న ఎంఈవో లాజర్

చెరుకుపల్లి: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను మండలంలో 18 మందిని గుర్తించామని ఎంఈవోలు లాజర్, నవీన్ కుమార్ తెలిపారు. వీరికి భవిత కేంద్రం ద్వారా విద్యాబుద్ధులను అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు సీఆర్పీలు కేసనశెట్టి సురేష్, రత్న శ్రీధర్ పేర్కొన్నారు. మండలంలో నిర్వహిస్తున్న 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపు సర్వేను శుక్రవారం వారు పరిశీలించారు. మానసిక వైకల్యం కలిగిన చిన్నారులకు భవిత స్కూలులో ఆటపాటలతో కూడిన విద్యను అందించి వీరిని సాధారణ విద్యార్థులుగా తీర్చిదిద్దటం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులు ఎటువంటి వైకల్యానికి గురైనా భవిత కేంద్రంలో గాని, సర్వేకు వచ్చిన భవిత సిబ్బందికి గాని వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. ఈ చిన్నారులను తల్లిదండ్రులు కనీసం తమ సమీపంలోని పాఠశాలలకైనా పంపాలని విజ్ఞప్తి చేశారు. సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్పీలు రవీంద్ర, టీవీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పోలీస్ సిబ్బందికి సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, హెచ్‌సీలకు సత్కారం

నగరంపాలెం: సుదీర్ఘ కాలం క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని జిల్లా ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావు అన్నారు. డీసీఆర్బీ ఎస్ఐ రామబ్రహ్మం, ఆర్ఎస్ఐ వి.వెంకటరావు, ఏఎస్‌ఐలు ఎన్.వెంకటేశ్వరరావు (నల్లపాడు), దుర్గాప్రసాద్ (అరండల్‌పేట), మల్లికార్జునరావు (తెనాలి ఒన్‌టౌన్), హెడ్‌కానిస్టేబుళ్లు పీవీ నరసింహారావు (తెనాలి ఒన్‌టౌన్), నాగేశ్వర రావు(తెనాలి త్రీటౌన్) శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని హాల్‌లో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఏఎస్పీ మాట్లాడుతూ శేష జీవితం మంచి ఆరోగ్యంతో ఉండాలని, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీహరిరెడ్డి, జిల్లా పోలీసు సంఘం ప్రతినిధులు కరుణాకర్, కరిముల్లా, లక్ష్మణ్, మైలా సాంబశివరావు పాల్గొన్నారు.

ఆ జీవోలు రద్దు చేయాలి

భట్టిప్రోలు: జీవో నెంబర్లు 26, 27, 28 రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.బాలాజి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 12న ఈ జీవోలను తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు గ్రూప్ 2, 3, 4కు టైప్ రైటింగ్ అర్హతను తొలగించి, సీపీటీ కోర్సు ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన విధించినట్లు చెప్పారు. ఇప్పటికే టైప్ రైటింగ్ ఉత్తీర్ణులైన నిరుద్యోగులు మరలా మరో పరీక్షకు వెళ్లమంటే శ్రమతో పాటు అధిక మొత్తం ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

పొగాకు జోక్యం నుంచి పిల్లలను రక్షిద్దాం

– ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ భాస్కరరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరు మెడికల్: పొగాకు ఉత్పత్తుల నుంచి పిల్లలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ఛాతి, సాంక్రమిక వ్యాధుల ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం నో టుబాకో డే సందర్భంగా గోరంట్లలోని ఆస్పత్రిలోని పొగాకు అనర్థాలపై అవగాహన ర్యాలీ, రోగులకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ నిర్వహించారు. డాక్టర్ భాస్కర రావు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ 1987లో మే 31న ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవంగా ప్రకటించిందన్నారు. నాటి నుంచి ప్రతిరోజూ మే 31న పొగాకు నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పొగాకు వాడకం వల్ల 20 రకాల క్యాన్సర్లు వస్తాయని చెప్పారు. ప్రతి ఏడాది ఎనిమిది లక్షల మంది పొగాకు బారిన పడుతున్నారని, ప్రపంచ వ్యాప్తంగా 67 వేల మంది చనిపోతున్నారని చెప్పారు. 15 నుంచి 19 ఏళ్ల వయస్సు గల యువత 2.67 కోట్ల మంది పొగాకు వాడుతున్నట్లు వెల్లడించారు. పొగాకు వాడకంలో భారత దేశం రెండో స్థానంలో ఉందని, పొగ పీల్చేవారి కంటే పొగాకు తినే వారు ఖైనీ, గుట్కా, జరదా తినేవారు ఎక్కువ మంది ఉన్నారన్నారు. క్యాన్సర్ వ్యాధులు 25 శాతం పొగాకు వల్ల వస్తున్నాయన్నారు.

జెముడుపాడులో కార్డన్ సెర్చ్



జెముడుపాడులో కార్డన్ సెర్చ్ లో స్వాధీనం చేసుకొన్న ద్విచక్రవాహనాలు

జెముడుపాడు(కొల్లిపర): సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జెముడుపాడు, పాలెం లో తెనాలి డీఎస్పీ రమేష్ ఆదేశాలతో తెనాలి లోకల్ 3టౌన్ సీఐలు, గ్రామీణ సీఐలు, కార్డన్ సెర్చ్ నిర్వహించారు.ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి ఉన్నత అధికారులతో కలసి సుమారు 50 మంది పోలీస్ సిబ్బందితో అనుమానితుల ఇళ్లు, పాతనేరస్తుల ఇళ్లలో తనిఖీచేసి సరైన ఆధారాలు చూపని 18 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. రానున్న ఎన్నికల కౌంటింగ్ సమయంలో గ్రామంలో అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తెనాలి, కొల్లిపర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు– క్రేన్ ఢీకొని ఇద్దరికి గాయాలు



ధ్వంసమైన బస్సు, క్రేన్ ముందు భాగం

తెనాలిరూరల్: ఆర్టీసీ బస్సు, క్రేన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయాలపాలవగా రెండు వాహనాలూ ధ్వంసమయ్యాయి. స్థానిక యడ్ల లింగయ్య పెట్రోలు బంకు రోడ్డులోని ఆషా థియేటర్ వద్ద పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు– క్రేన్ ఢీ కొన్న ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. గుంటూరు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణీకులని దించి బస్ స్టేషన్ వైపుకు వెళుతుండగా ప్రియ డీలక్స్ వైపు నుంచి క్రేన్ రోడ్డు పైకి రావడంతో అదే సమయంలో అతివేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు క్రేన్‌ని ఢీ కొట్టింది. క్రేన్ ముందు భాగం, టైర్ పగిలి పోయింది. ఇదే సమయంలో క్రేన్ పక్కగా స్కూటీపై వెళుతున్న షేక్ అఫీజా, రాజశేఖర్‌లకు గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు మరొక ఆర్టీసీ బస్సును ఒవర్‌టేక్ చేసి అతివేగంగా రావటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని క్రేన్ యజమాని ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఈ ప్రమాదంలో క్రేన్ సహా ఆర్టీసీ బస్సు ఎడమ భాగం పాక్షికంగా ధ్వంసమైంది. అంత పెద్ద ప్రమాదం జరిగినా ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

పంటకాల్వల మరమ్మతులు అవసరం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు

తెనాలి: కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గల ప్రధాన పంటకాల్వలు, ఉప కాల్వల్లో సత్వరమే మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమడెల్టా పరిధిలోని 5.75 లక్షల ఎకరాల్లో రైతాంగం దుక్కులు దున్ని, పచ్చిరొట్ట విత్తనాలు చల్లుతున్న తరుణంలో పంటకాల్వలు, మురుగు కాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్కలతోపాటు మేటలు వేశాయని తెలిపారు. వెంటనే ఆయా కాల్వల్లో మరమ్మతు పనులు చేపట్టాలని కోరారు. అదేవిధంగా దుగ్గిరాల, కొమ్మమూరు, పిడపర్రు లాకులు శిథిలావస్థకు చేరుకున్నాయని గుర్తుచేశారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది తూటాకు, గుర్రపుడెక్క తొలగించక పోవటంతో వర్షాకాలంలో రైతులు ఇబ్బందులు పడినట్టు చెప్పారు. ఈ ప్రకారం వినతిపత్రాలను ఇరిగేషన్, డ్రైనేజి అధికారులకు అందజేశామని తెలిపారు.

రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ టీఎస్ ఛానల్ పరిధిలోని ఆరెమండ స్లూయిజ్ వద్ద వేసిన ఇసుక బస్తాలు ఎప్పుడైనా కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. అదే జరిగితే 26 వేల ఎకరాల్లో నష్టం జరుగుతుందని తెలిపారు. పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌కు కోటి రూపాయలు కేటాయించినట్టయితే 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందుతుందని చెప్పారు. కేవీ సత్యనారాయణ, ఈదర పూర్ణచంద్, మేకల చిట్టిబాబు మాట్లాడారు. తొలుత ఇరిగేషన్ డ్రైనేజి, మున్సిపల్ అధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

టెన్త్‌లో మారిన పాఠ్యాంశాల బోధనపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతిలో కొత్తగా ప్రవేశపెట్టిన పాఠ్యాంశాల బోధనపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డీవైఈఓ కె.దశపతిరావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ(ఆపస్) ఆధ్వర్యంలో శుక్రవారం అరండల్‌పేట మూడో లైనులోని యోగిభవన్‌లో సంఘ జిల్లా అభ్యాసనవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న దశపతిరావు మాట్లాడుతూ టెన్త్‌లో మారిన పాఠ్యాంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బాలచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి పి.పద్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, నాయకులు డి.నాగభారతి, డి. శివపార్వతి, మురళీకృష్ణ, వై.రమ, ఆదినారాయణ, డి.రామాంజనేయులు, కిషోర్ పాల్గొన్నారు.